హక్కు పత్రం ఉన్నా..
తీరని రుణ చిక్కులు

జిల్లాలో 2024-25 ఆర్థిక సంవత్సర పంట రుణ లక్ష్యం రూ.1621.29 కోట్లు కాగా.. మొదటి త్రైమాసికం (ఏప్రిల్, మే, జూన్)లో రూ.951.36 కోట్లు ఇచ్చినట్లు గణాంకాలు చెబుతున్నాయి. అదే 2023-24 ఆర్థిక సంవత్సరంలో లక్ష్యం రూ.1519.40 కోట్లు కాగా రూ.921.36 కోట్లు అంటే 61 శాతం ఇచ్చినట్లు లెక్కలు చూపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మొదటి మూడు నెలల్లోనే 59 శాతం రుణాలు ఇచ్చినట్లు చూపడం.. పుస్తక సర్దుబాటనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

● బ్యాంకర్ల చుట్టూ తిరుగుతున్న ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాదారులు



జిల్లాలో అటవీ హక్కు పత్రాలు కలిగిన మొత్తం రైతులు : 28,154

వీరు సాగు చేస్తున్న అటవీ భూమి : 93,467 ఎకరాలు

ఆసిఫాబాద్, తిర్యాణి, న్యూస్‌టుడే

అటవీ భూములు సాగు చేసుకుంటున్న గిరిజన రైతులకు ప్రభుత్వం హక్కు పత్రాలు అందించినా.. బ్యాంకర్లు కరుణ చూపడంలేదు. పంట రుణాల కోసం తిరుగుతున్నా.. అప్పు దొరకక ప్రైవేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ఏటా బ్యాంకులకు రుణ వితరణ లక్ష్యం నిర్దేశిస్తున్నా.. కనీసం 75 శాతం కూడా దాటడం లేదు. ఉన్న ఖాతాదారుల నుంచి రుణాల వడ్డీ కట్టించుకుని పునరుద్ధరించి కొంతమేర కలిపి ఇచ్చి పుస్తక సర్దుబాటు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇక కొత్త వారు రుణాల కోసం ఏళ్ల తరబడి పడిగాపులు కాస్తున్నారు.

జిల్లాలో మెజారిటీ ఏజెన్సీ మండలాలు ఉన్నాయి. చాలా మంది గిరిజనులతో పాటు గిరిజనేతరులు అటవీ భూములు సాగు చేసుకుంటూ జీవిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో 15,519 మంది గిరిజనులకు గతేడాది 47,138 ఎకరాలకు సంబంధించి హక్కు పత్రాలు జారీ చేశారు. వీరికి రైతుబంధు సైతం అందించారు. కానీ బ్యాంకుల్లో పంట రుణాల కోసం వెళ్తే కొర్రీలు పెడుతున్నట్లు వాపోతున్నారు.


అటవీహక్కు పత్రాలుంటే ఇవ్వాలని చెప్పాం

రాజేశ్వర్‌జోషి, ఎల్‌డీఎం

అటవీ హక్కు పత్రాలున్న రైతులకు పంట రుణాలు ఇవ్వాలని కలెక్టర్ ఇప్పటికే బ్యాంకర్లకు సూచించారు. కొన్ని చోట్ల రుణాలు ఇస్తున్నట్లు చెబుతున్నారు. ఎవరికైనా ఇవ్వకుంటే ఫిర్యాదు చేయొచ్చు.

రేపు, మాపు అంటున్నారు


వెల్మల గోపాల్, బోరింగ్‌గూడ



తిర్యాణి మండలం సోనాపూర్ గ్రామ సమీపంలో మూడు ఎకరాల అటవీ భూమి ఉంది. గతేడాది హక్కు పత్రం పొందాను. ఈ సారి పత్తి వేశా. పంట రుణం కోసం బ్యాంకుకు వెళ్తే రేపు, మాపు అని తిప్పుతున్నారు. ఇప్పటి వరకు ఇవ్వలేదు. దీంతో ప్రైవేటులో రూ.2 లక్షల అప్పు తీసుకున్నా.

బయట అప్పుచేశాను

చిక్రం జుగాదిరావు, తిర్యాణి



తిర్యాణి మండలంలోని గోయగాం పంచాయతీ పరిధిలో ఒకటిన్నర ఎకరాల అటవీ భూమి సాగు చేస్తున్నా. ఆ భూమికి హక్కు పత్రం ఇచ్చారు. కానీ పంట రుణం ఇవ్వడంలేదు. పత్తి పంట సాగుచేస్తున్నా.. ఈ సారి రైతుబంధు సైతం రాలేదు. దీంతో పెట్టుబడి కోసం బయట రూ.50 వేలు అప్పు చేశా. పంట రుణం ఇప్పించి ఆదుకోవాలి.

ముగిసిన ప్రశస్త్ శిక్షణ

ఆసిఫాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : విద్యార్థుల్లో ఆరోగ్య సమస్యలు, వైకల్యాలు గుర్తించేందుకు ఉపాధ్యాయులకు ప్రశస్త్ యాప్‌ను ఉపయోగించాలని జిల్లా ఇన్‌ఛార్జి డీఈఓ ఎం.ఉదయ్‌బాబు సూచించారు. జన్కాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో మండలంలోని అన్ని యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల ఉపాధ్యాయులకు బుధవారం నిర్వహించిన శిక్షణ ముగింపు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం విద్యార్థుల ఆరోగ్య సమస్యల గుర్తింపు కోసం ఈ కార్యక్రమాన్ని అమలు పరుస్తోందన్నారు. రిసోర్సు పర్సన్ చైతన్యకుమార్, ఐఆర్‌పీ వెంకటరమణ పాల్గొన్నారు.

అక్షరానికి తోడు.. ఉపాధి తోడ్పాటు

● వయోజనులకోసం నవభారత సాక్షరత కార్యక్రమం

న్యూస్‌టుడే, ఆసిఫాబాద్ అర్బన్

నిరక్షరాస్యులైన వయోజనులందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం నవభారత సాక్షరత (న్యూ ఇండియా లిటరసీ ప్రోగ్రాం) కార్యక్రమాన్ని రూపొందించింది. 15ఏళ్లు పైబడిన నిరక్షరాస్యులను గుర్తించి 5 దశల్లో వారికి శిక్షణనిచ్చి అక్షరాస్యులుగా తీర్చిదిద్ది స్వయం ఉపాధి పొందేలా మార్చడమే దీని ఉద్దేశం. కేంద్రం 60శాతం, రాష్ట్రాలు 40శాతం నిధులు వెచ్చించనున్నాయి. కేంద్రం తాజాగా తన వాటా నిధులను విడుదల చేసింది. జిల్లాలో వచ్చే నెల నుంచి అమలు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. జిల్లాలో 96,156 మంది నిరక్షరాస్యులను గుర్తించగా.. మొదటి దశ కింద 14,989 మందిని అక్షరాస్యులుగా తీరిదిద్దనున్నారు.

వయోజన విద్యలో భాగంగా.. 2018 వరకు నిర్వహించిన సాక్షర భారత్ కార్యక్రమానికి భిన్నంగా వ్యక్తి సర్వతోముఖాభివృద్ధి కోసం కొత్త కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. జాతీయ నూతన విద్యా విధానం-2020 ప్రకటించిన మేరకు వచ్చే అయిదేళ్లలో నవభారత సాక్షరత కార్యక్రమం ద్వారా దేశంలో సంపూర్ణ అక్షరాస్యత సాధించాలన్నది ప్రభుత్వ యోచన. వంద రోజుల్లో దీన్ని పూర్తి చేసేందుకు బోధనాభ్యసన సామగ్రిని సిద్ధం చేస్తున్నారు. స్వయం సహాయక సంఘాలు, ఐకేపీ మహిళలు, ఐసీడీఎస్ లబ్ధిదారులు, ఉపాధిహామీ కూలీలకు ఇందులో ప్రాధాన్యం ఇవ్వనున్నారు.

అయిదు దశల్లో శిక్షణ..

◆ ఎంపిక చేసిన నిరక్షరాస్యులకు మొదటి దశలో (ఫౌండేషనల్ లిటరసీ) రాయడం, చదవడం, చిన్నచిన్న లెక్కలు చేయడం నేర్పిస్తారు. 100 రోజుల్లో నేర్పించి 150 మార్కులతో తుది పరీక్ష నిర్వహించి ఉత్తీర్ణత సాధించిన వారికి ధ్రువపత్రాలు ఇస్తారు.

◆ రెండో దశలో ఆర్థిక అవగాహన, సాంకేతిక అక్షరాస్యత, న్యాయ పరిజ్ఞానంపై శిక్షణనిస్తారు. ఆరోగ్యం రక్షణ, పిల్లల పోషణ, విద్య, కుటుంబ సంక్షేమంపై అవగాహన కల్పిస్తారు.

◆ మూడో దశలో బేసిక్ ఎడ్యుకేషన్‌గా 3-5 తరగతుల ప్రాథమిక విద్య, 6-8 తరగతులు మాధ్యమిక విద్య, 9-12తరగతుల సెకండరీ విద్య అందించేందుకు చర్యలు తీసుకోనున్నారు.

◆ నాలుగో దశలో వృత్తి నైపుణ్యాలు పెంపొందించే శిక్షణనిచ్చి, స్థానికంగా ఉపాధి అవకాశాలు కల్పిస్తారు.

◆ అయిదో దశలో వీరితో స్వయం సహాయక సంఘాల కూర్పు, స్వచ్ఛంద గ్రూపుల ఏర్పాటు, వివిధ సంస్థలు ఏర్పాటు చేసుకొని అభివృద్ధి చెందేందుకు అవకాశం కల్పించడం

అమలు తీరు..

ఈ కార్యక్రమం పూర్తిగా స్వచ్ఛందంగా ముందుకొచ్చే స్థానిక వాలంటీర్ల ద్వారా అమలు కానుంది. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఇద్దరు ఉపాధ్యాయుల సహకారంతో వాలంటీర్ల ద్వారా వయోజనులకు సాయంత్రం వేళల్లో అక్షరాస్యత అందించనున్నారు.


జిల్లా వివరాలు

	గుర్తించిన నిరక్షరాస్యులు	మొదటి దశ లక్ష్యం
పురుషులు	37,059	5,992
స్త్రీలు	59,097	8,987
మొత్తం	96,156	14,989



అక్షరాస్యతతోపాటు జీవిత పాఠాలు

ఎ.శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ డైరెక్టర్ వయోజన విద్య



నవభారత్ సాక్షరత కార్యక్రమం నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే కాకుండా జీవన నైపుణ్యాలను నేర్పి ఉపాధి అవకాశాలను కల్పిస్తుంది. కలెక్టర్ల ఆధ్వర్యంలో సమన్వయ సమావేశాలు నిర్వహించనున్నాం. త్వరలోనే నిరక్షరాస్యులు, వాలంటీర్లను గుర్తిస్తాం. పాఠ్యపుస్తకాలు, బోధనాభ్యసన పరికరాలను సిద్ధం చేస్తున్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, చిత్రంలో వివిధ శాఖల అధికారులు

పకడ్బందీగా సార్వత్రిక పది, ఇంటర్ పరీక్షల నిర్వహణ

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : జిల్లాలో అక్టోబర్ 3-9 తేదీ వరకు నిర్వహించనున్న ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ పరీక్షలు సజావుగా జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి విద్య, వైద్య, పోలీసులు, విద్యుత్తు, మిషన్ భగీరథ, పుర, ఆర్టీసీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలన్నారు. పదో తరగతి పరీక్షల కోసం జిల్లా కేంద్రంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, ఇంటర్ పరీక్షల కోసం జన్కాపూర్‌లోని జడ్పీ ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పదో తరగతికి 165 మంది, ఇంటర్‌కు 110 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా చూడాలన్నారు. పరీక్షకు సంబంధించిన ప్రశ్నా పత్రాలను పోలీసు బందోబస్తు మధ్య కేంద్రాలకు తరలించాలని స్పష్టం చేశారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. సమావేశంలో ఎంఈవో ఉదయ్‌బాబు, డీఎంహెచ్‌వో తుకారాం, సీఐ సతీష్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

వయోవృద్ధుల సంక్షేమానికి కృషి

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : భావితరాలకు మార్గదర్శకులుగా నిలిచే వయోవృద్ధుల సంక్షేమానికి అందరూ కృషి చేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా మహిళ శిశు దివ్యాంగుల వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అక్టోబరు 1న దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలో నిర్వహిస్తున్న వారోత్సవాలను జయప్రదం చేయాలన్నారు. వారి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 26-30 వరకు నిత్యం వివిధ కార్యక్రమాలు నిర్వహించాలని, అక్టోబరు 1న కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి ఉత్సవాలు నిర్వహించాలని పేర్కొన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. సంబంధిత గోడ ప్రతులు ఆవిష్కరించారు. జిల్లా సంక్షేమ అధికారి ఆడెపు భాస్కర్, వయోవృద్ధుల సంక్షేమ సంఘం సభ్యుడు గుండా శంకర్, పెద్దింటి లక్ష్మణ రావు, విజయ్‌కుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

27న షూటింగ్ బాల్ జిల్లా జట్ల ఎంపిక పోటీలు

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల వద్ద ఈ నెల 27న మధ్యాహ్నం 2 గంటలకు జూనియర్ అండర్-19 బాల, బాలికల షూటింగ్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక పోటీలు ఉంటాయని జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి దుర్గం గురువేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు ఆధార్, పుట్టిన తేదీ, బోనఫైడ్, నాలుగు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో హాజరై పీడీ భవిత, పీఈటీ చిన్నక్కల వద్ద రిపోర్టు చేయాలన్నారు. ఇతర వివరాలకు చరవాణి నం. 86398 23485 సంప్రదించాలన్నారు.

నూనెలు సలసల.. పండగ ఎలా?

న్యూస్‌టుడే, రాంనగర్, ఇంద్రవెల్లి

తెలుగిళ్లలో పెద్ద పండగలు దసరా, దీపావళి, సంక్రాంతి వరుసగా రాబోతున్నాయి. సరిగ్గా ఈ సమయంలోనే నూనెలు, పప్పుల ధరలు అమాంతం పెరగడంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. పండగలు అంటేనే.. సకినాలు, గారెలు, బూరెలు, అరిసెలు చేసుకోవడం ఆనవాయితీ. నగరాల్లో ఉండే వారు కూడా సెలవుల్లో ఇంటికి వస్తారు. వాళ్లకు ఇష్టమైనవి చేసి పెట్టాలని ఉంటుంది. నూనె సెగలతో కుటుంబాలపై అదనపు భారం పడుతోంది.

ఉమ్మడి జిల్లాలో ప్రతి నెల 40 లక్షల లీటర్ల నూనె వినియోగిస్తారు. నిరుపేదలతో పాటు హోటళ్లలో పామాయిల్ వినియోగం అధికంగా ఉంటుంది. ఇతర నూనెల ధరలతో పోలిస్తే లీటరుకు రూ.20-30 తక్కువగా ఉండటంతో వీటిని వినియోగిస్తారు. ఇటీవల ఆరోగ్యంపై శ్రద్ధతో బ్రౌన్ రైస్ నూనె, ఆలివ్ ఆయిల్, కొబ్బరినూనెల వినియోగం పెరిగింది. బ్రాండెడ్ పేరిట కొన్నింటిని లీటరు 200లకు పైగా విక్రయిస్తున్నారు.

జిల్లాలో కుటుంబాలు : 8.50 లక్షలు

జనాభా: 28 లక్షలు

నూనె నెల వినియోగం : 40 లక్షల లీటర్లు

కుటుంబాలపై పడే అదనపు భారం: రూ. 8 కోట్లు

దిగుమతి సుంకం పెరగడంతోనే..

నూనెల ధరలు లీటరుకు సగటున రూ.20 పెరిగాయి. దిగుమతి సుంకం పెరగడంతోనే ధరలు పెరిగాయని నూనె వ్యాపారి సురేశ్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నూనెలపై సుంకాన్ని భారీగా పెంచడంతో సంస్థలు ఆ భారాన్ని ప్రజలపైనే మోపాయని ఆయన పేర్కొన్నారు. ముడిసరకుగా దిగుమతి చేసుకునే వంట నూనెలకు(క్రూడ్ ఆయిల్) గతంలో 12.5 శాతం సుంకం ఉండేది. తాజాగా కేంద్ర ప్రభుత్వం దీన్ని 32.5 శాతానికి పెంచడంతో భారం పెరిగిపోయింది. ఒక్కో కుటుంబం సగటున అయిదు లీటర్ల నూనెను వినియోగిస్తారు. ఈ లెక్కన నెలకు కుటుంబంపై రూ.100 అదనంగా భారం పడుతోంది.

ధరలను నియంత్రించాలి

అరుణ, గృహిణి, శాంతినగర్




పెరుగుతున్న ధరలను ప్రభుత్వం నియంత్రించాలి. ప్రభుత్వాలు పన్నులు పెంచిన ప్రతి సారి ఆ భారం నేరుగా ప్రజలపైనే వేస్తున్నారు. దిగుమతి సుంకం పెరిగితే కంపెనీలు 50 శాతం కూడా భరించకుండా నేరుగా ధరలు పెంచేసి వినియోగదారులపైనే భారం మోపడం ఎంత వరకు సమంజసం.



సామాన్యులపై భారమే

టేకం భీంబాయి, మొలలగుట్ట, ఇంద్రవెల్లి మండలం

ధరల పెరుగుదలతో సామాన్యులపై భారం పడుతోంది. గత నెల కంటే లీటరుకు రూ.20 నుంచి రూ.30 ధర పెరిగింది. సంతలో నాసిరకం కంపెనీల నూనె తీసుకొచ్చి అదే ధరతో విక్రయిస్తున్నారు. నూనెలు రేషన్ దుకాణాల్లో అందుబాటులో ఉంచి, రాయితీపై విక్రయిస్తే మాలాంటి పేదోళ్లకు కొంత మేలు జరుగుతుంది.



నూనెలు	వారం కిందట	ప్రస్తుతం
వేరుశనగ	120	150
సన్‌ఫ్లవర్	110	130
పామాయిల్	95	115
ఇతర నూనెలు	100	135
నాణ్యమైన నూనె(గానుగ)	315	340



నోటీసులు జారీ

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే : కాగజ్‌నగర్ మున్సిపాలిటీలోని ధోబీఘాట్‌ను ఆనుకుని ఉన్న స్థలం ఆక్రమణకు గురవుతోందని 'ఈనాడు'లో 'ధోబీఘాట్.. హాంఫట్' శీర్షికన ఈ నెల 25న కథనం ప్రచురితమైంది. దీనికి పురపాలిక అధికారులు స్పందించారు. ఈ స్థలంలో చేపడుతున్న నిర్మాణాలకు ఎలాంటి అనుమతులు లేవని టౌన్ ప్లానింగ్ అధికారి యశ్వంత్ తెలిపారు. పురపాలిక కార్యాలయం నుంచి ఎలాంటి అనుమతి లేకుండా నిర్మించిన పిల్లర్లను 15 రోజుల్లో తొలగించాలని ఆదేశిస్తూ నిర్మాణాలు చేపడుతున్న వ్యక్తికి బుధవారం నోటీసులు జారీ చేసినట్లు పురపాలిక కమిషనర్ అంజయ్య తెలిపారు.



తిరుపతిని సత్కరిస్తున్న ప్రిన్సిపల్ అబ్దుల్ రహీమ్, తదితరులు

అంతర్జాతీయ స్థాయిలో మెరిసి.. ఆదర్శంగా నిలిచి!

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల/కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి ఆడె తిరుపతి.. అంతర్జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో ప్రతిభ చాటాడు. కౌటాల మండలం ముత్తంపేట్‌కు చెందిన అతడు. . ఈ నెల 3-14 వరకు జోర్డాన్ దేశంలోని అమాన్ సిటీలో నిర్వహించిన 10వ అంతర్జాతీయ హ్యాండ్ బాల్ యూత్, పురుషుల ఛాంపియన్ క్రీడా పోటీల్లో భారత జట్టు తరపున ఆడాడు. సంక్షేమ గురుకుల సంస్థ ఆధ్వర్యంలో స్టేషన్ ఘన్‌పూర్‌లోని హ్యాండ్‌బాల్ అకాడమిలో ఎడ్ల ప్రవీణ్ వద్ద శిక్షణ పొందుతున్నాడు. ఇటీవల రాజస్థాన్‌లో నిర్వహించిన జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ చాటి వారం పాటు ప్రత్యేక శిబిరంలో శిక్షణ పొందాడు. అనంతరం భారత జట్టుకు ఆడే అవకాశం దక్కించుకున్నాడు. బుధవారం సదరు విద్యార్థికి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో అభినందన సభ నిర్వహించి ఘనంగా సత్కరించారు. గురుకుల ప్రిన్సిపల్ అబ్దుల్ రహీమ్ మాట్లాడుతూ.. పీడీ సట్ల శంకర్, పీఈటీ కోట యాదగిరి కృషితో హ్యాండ్‌బాల్ అకాడమిలో శిక్షణలో చేరినట్లు చెప్పారు. తిరుపతి అంతర్జాతీయ స్థాయి పోటీల్లో ఆడడం ఇతర క్రీడాకారులకు ఆదర్శనీయమన్నారు. అంతకు ముందు విద్యార్థికి సహ విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘన స్వాగతం పలికారు.

సగం చెరువులు మాయం



జిల్లా	మొత్తం	ప్రస్తుతం	మాయం
నిర్మల్	1,149	791	358
ఆదిలాబాద్	577	458	119
మంచిర్యాల	1,297	890	407
ఆసిఫాబాద్	1,498	563	935

ఆదిలాబాద్ వ్యవసాయం, న్యూస్‌టుడే

ఉమ్మడి జిల్లాలో గత ప్రభుత్వం మిషన్ కాకతీయ పథకంలో భాగంగా చేపట్టిన సర్వే వివరాల మేరకు 7,380 నీటివనరులుండగా వాటిలో 4,521 చెరువులను గుర్తించారు. ఈ పథకం ముగిసేలోపు 1,491 చెరువులను బాగు చేసినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. హైదరాబాద్‌లో చెరువుల ఆక్రమణలపై దృష్టి సారించిన ప్రభుత్వం తాజాగా జిల్లాలవారీగా చెరువుల రక్షణపై దృష్టిసారించింది. ఇందులో భాగంగా చెరువుల సరిహద్దులను గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది.

◆ ఆదిలాబాద్ పట్టణ పరిధిలో 12 చెరువులు, కుంటలు కలిపి 518 ఎకరాల్లో విస్తరించి ఉండాలి. ఇందులో ఇప్పటికే వందల ఎకరాల భూమి ఆక్రమణకు గురైంది. ఆదిలాబాద్ పట్టణం నడిబొడ్డున ఉన్న ఖానాపూర్ చెరువు 114 ఎకరాల్లో ఉండాలని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఇది ఆక్రమణలకు గురై 60 ఎకరాలకు చేరింది. దీన్ని ట్యాంకుబండ్ మాదిరి చేయాలని గత ప్రభుత్వం రూ. 4 కోట్లు మంజూరు చేసింది. చెరువు ఆక్రమణలకు గురికావడంతో పనులు పూర్తి చేయలేకపోయారు. పట్టణ పరిధిలోని మరో అయిదు చెరువులు అన్యాక్రాంతం అవుతున్నాయి. జిల్లాలో 119 చెరువుల జాడ లేకుండా ఉంది. ప్రభుత్వ ఆదేశాలతో జిల్లా పాలనాధికారి సంబంధిత అధికారులతో కమిటీ వేశారు.

◆ మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట మండలంలో నిజాం కాలంలో ఏడు చెరువులను గొలుసుకట్టుగా అభివృద్ధి చేశారు. దొనబండ వాగు మత్తడి నుంచి మొదలు ఇటిక్యాల చెరువు వరకు మధ్యలో అయిదు చెరువులు నిర్మించారు. కాలువల ద్వారా ఒకటి నిండగానే మరో చెరువుకు నీరందేలా చర్యలు తీసుకున్నారు. ఈ కాలువలు, చెరువు భూములు ఆక్రమణకు గురి అవుతున్నాయి. బెల్లంపల్లిలోని రైల్వే రడగం బాలబస్తీ జాతికుంట చెరువు 48 ఎకరాల్లో ఉండేది. అలాంటిది తాజా లెక్కల మేరకు తొమ్మిది ఎకరాలకే పరిమితం అయింది.

1,819 చెరువులు మాయం

ఉమ్మడి జిల్లాలో గత లెక్కలు, తాజా వివరాలతో పోలిస్తే 1,819 చెరువులు మాయమైనట్లు తెలుస్తోంది. మిషన్ కాకతీయ పథకంలో భాగంగా గతంలో గ్రామాలవారీగా సర్వే నిర్వహించారు. అప్పటి లెక్కల మేరకు ఉమ్మడి జిల్లాలో 4,521 చెరువులు ఉండాలి. కానీ ప్రస్తుతం నీటి పారుదలశాఖ లెక్కల మేరకు 2,702 చెరువులు ఉన్నాయి. అందులోనూ వంద ఎకరాల్లో సాగు నీరందించేవి 668 ఉండగా మిగిలిన 2034 చెరువులు వంద ఎకరాలకు పైగా సాగు నీటిని అందిస్తున్నాయి. కొన్ని గ్రామాల్లో చెరువు భూములకు పట్టాలు పుట్టుకొచ్చాయనే ఆరోపణలున్నాయి. ఉమ్మడి జిల్లాలో 50 శాతం చెరువు భూములు కబ్జాలోనే ఉన్నాయి. రెవెన్యూ రికార్డుల ప్రకారం నీటిపారుదల, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా సర్వే చేపడితే చెరువుల లెక్కలు తేలే అవకాశం ఉంది.

◆ నిర్మల్ పట్టణ పరిధిలోని చెరువులు ఆక్రమణలకు గురవుతున్నాయి. మంజులాపూర్ చెరువు 46.07 ఎకరాల్లో విస్తరించి ఉందని అధికారిక రికార్డులో ఉండగా పలువురు దర్జాగా కబ్జా చేస్తుండటంతో కొద్దిరోజుల్లో చెరువు కనుమరుగయ్యేలా ఉంది. కంచరోని, ఇబ్రహీం, రాంసాగర్, గొల్లపేట, ధర్మసాగర్, కురన్నపేట, పల్లెచెరువులు ఆక్రమణలకు గురవుతున్నాయి. జిల్లాల్లో ఇప్పటికే 358 చెరువులు మాయమైపోయాయి.



నిర్మల్ పట్టణం ఎన్టీఆర్ మార్గ్ భాగ్యనగర్ వద్ద కబ్జాకు గురవుతున్న మంజులాపూర్ చెరువు

సాంకేతికత ఈయన చొరవే



ఉట్నూర్-లాల్‌టెకిడిలోని ఆదర్శ పాలిటెక్నిక్ కళాశాల



ముత్యాల రాజు

ముత్యాల రాజు ఐఏఎస్ ఆల్ ఇండియా టాపర్‌గా నిలిచిన ఈ అధికారి 31.03.2011 నుంచి 09.10.2012 వరకు ఇక్కడ పీవోగా పని చేశారు. పని తీరులో పారదర్శకత, నిర్ణయం తీసుకోవడంలో వేగం ఈయన సొంతం. పదో తరగతి పూర్తయ్యాక గిరిజన విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని గుర్తించి ఉట్నూరులో గురుకుల జూనియర్ కళాశాల ఏర్పాటుకు కృషి చేశారు. సాంకేతిక విద్యా మండలితో మాట్లాడి ఉట్నూర్-లాల్‌టెకిడిలో ఆదర్శ పాలిటెక్నిక్ కళాశాల నెలకొల్పడంలో సఫలీకృతులయ్యారు.

ఉద్యోగ ధర్మాన్ని అంకితభావంతో నిర్వహించే అధికారులు కొందరైతే.. ప్రజల అవసరాలను గుర్తించి వారికి ఉపయోగపడే పనుల కోసం అహర్నిశలు పాటుపడే వారు మరికొందరు. ఆ కోవకే చెందుతారు ఈ నలుగురు ఐఏఎస్ అధికారులు. ఉట్నూరు ఐటీడీఏ పీవోలుగా విద్య, వైద్యం, ఉపాధితో పాటు కనీస సదుపాయాలు వారికి అందేలా చేసి అడవిబిడ్డల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారు. వీరి సేవలను నిత్యం యాది చేసుకుంటూనే ఉన్నారు ఇక్కడి గిరి'జనం'. వారే ముత్యాల రాజు, జనార్దన్ నివాస్, ఆర్వీ కర్ణన్, వరుణ్‌రెడ్డి. -న్యూస్‌టుడే, ఉట్నూరు

వీరి చిత్తశుద్ధి.. కావాలి ఇతరులకు స్ఫూర్తి

● ఈ ఐఏఎస్‌ల కృషి చిరస్మరణీయం



ఉట్నూరు ఐటీడీఏ కార్యాలయం

ప్రధాని మెచ్చిన అవ్వాల్ సేవలు



గర్భిణిని అంబులెన్స్‌లో తీసుకెళ్తూ..



జనార్దన్ నివాస్

ఐటీడీఏ పీవోగా 2013 నుంచి 2014 వరకు పని చేసిన జనార్దన్ నివాస్ మారుమూల గిరిజనులకు మెరుగైన వైద్యమందించేందుకు విశేషంగా కృషి చేశారు. మాతా, శిశు మరణాలలో ఉమ్మడి ఆదిలాబాద్ దేశంలోనే మూడు, నాలుగు స్థానాలలో ఉండేది. ఈ గణాంకాలను చూసి దిగ్భ్రాంతికి గురైన పీవో జనార్దన్ నివాస్ గర్భిణులకు ఉచితంగా అంబులెన్స్ సేవలను అందించే అవ్వాల్(గోండి భాషలో అమ్మ) పేరుతో కొత్త పథకాన్ని ప్రవేశపెట్టారు. ఐటీడీఏలో కాల్‌సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఎంతో గుర్తింపు పొందిన ఈ సేవలు కేంద్ర ప్రభుత్వాన్ని ఆకర్షించాయి. ప్రధాని మోదీ ఆయన సేవలను ప్రశంసించారు.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదివాసీ, గిరిజనుల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పని చేయాల్సిన బాధ్యత ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిపై ఉంది. ఐటీడీఏ స్థాపించిన నాటి నుంచి ఇప్పటి వరకు అనేక మంది పీవోలు పని చేశారు. అందులో కొందరు ఉత్తమ సేవలతో ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారు. *1987 నుంచి 1990* వరకు మూడేళ్లపాటు ఐటీడీఏ పీవోగా పని చేసిన పి.సుబ్రహ్మణ్యం ఆదివాసీ హృదయాలను గెలిచారు. గోండి భాషను నేర్చుకొని వారికి చక్కటి సేవలందించారు. ఆ తరువాత రెండు దశాబ్దాల తర్వాత నలుగురు అధికారులు సేవలతో ప్రత్యేక గుర్తింపు పొందారు.



'నీ కోసం జీవిస్తే నీలోనే జీవిస్తావు జనం కోసం జీవిస్తే జనంలో నిలిచిపోతావు' - డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

అక్షర జ్యోతి.. యువతకు ఉపాధి

ఏడాది కాలం ఐటీడీఏ పీవోగా పని చేసిన వరుణ్‌రెడ్డి గిరిజన విద్యార్థుల చదువులపై ప్రత్యేకంగా దృష్టిపెట్టారు. వారిలో విద్యా ప్రమాణాలను పెంచేందుకు 'అక్షర జ్యోతి' కార్యక్రమం చేపట్టి విద్యార్థులు చదువుల్లో రాణించేలా ప్రతి వారం పరీక్షలు, సబ్జెక్టుల్లో విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తూ మంచి ఫలితాలు సాధించేలా ప్రోత్సహించారు. ఇంజినీరింగ్, ఐఐటీ చదువుతున్న పేద విద్యార్థులకు ఐటీడీఏ ద్వారా ఉచితంగా ల్యాప్‌ట్యాప్‌లను అందజేశారు. గిరిజన నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించారు.



గిరిజన విద్యార్థికి ల్యాప్‌ట్యాప్‌ను అందజేస్తున్న ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి

'గిరి' దివ్యాంగులకు వికాసం



ఉట్నూరులో ఏర్పాటుచేసిన వికాసం పాఠశాల



ఆర్వీ కర్ణన్

మూడేళ్లు ఐటీడీఏ పీవోగా పని చేసిన ఆర్వీ కర్ణన్ విస్తృతంగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ గిరిజనులతో మమేకమై వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. ఆదివాసీ, గిరిజన దివ్యాంగ పిల్లలకు ప్రత్యేక బడి లేక వారు చదువులకు దూరమవుతున్నారని గుర్తించారు. ఛత్తీస్‌గఢ్‌లోని సక్షం పాఠశాలకు దీటుగా ఉట్నూరులో వికాసం ప్రత్యేక బాలల బడిని ఏర్పాటు చేశారు. అన్ని రకాల సౌకర్యాలు సమకూర్చారు. రాష్ట్రంలో తొలి గిరిజన దివ్యాంగ పాఠశాలగా ఈ బడి గుర్తింపు పొందింది. రాష్ట్ర ప్రభుత్వం ఈ పాఠశాలకు ఇన్నోవేషన్ పురస్కారంతో సత్కరించింది.

మరో ముగ్గురు ఉపాధ్యాయులు..!

● ఆన్‌లైన్ పెట్టుబడుల వ్యవహారంలో అరెస్టు

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలో కలకలం సృష్టించిన యూబిట్ క్రిప్టోకరెన్సీ మోసం కేసులో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. విచారణలో భాగంగా ఇప్పటికే అయిదుగురిని రిమాండ్‌కు పంపిన పోలీసులు తాజాగా మరో ముగ్గురు ఉపాధ్యాయులను అరెస్టు చేశారు. వారిని బుధవారం రిమాండ్‌కు తరలించారు. ఇందులో దాసరి రమేశ్ (కడెం మండలం కన్నాపూర్ పాఠశాల), కిరం వెంకటేశ్ గౌడ్ (కుభీరు మండలం దౌజీనాయక్ తండా పాఠశాల), బొమ్మిడి ధనుంజయ్ (ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం సొనాల పాఠశాల) ఉన్నారు.

ఖాతాల స్తంభన..

ఆన్‌లైన్ పెట్టుబడులతో అధిక రాబడులు వస్తాయని తప్పుడు వాగ్దానాలు చేస్తూ పెట్టుబడిదారులను ప్రలోభాలకు గురిచేస్తున్నారనేది ఈ కేసులో ప్రధాన ఆరోపణ. పిరమిడ్ తరహాలో ఈ పథకాన్ని విస్తరించడంలో స్టార్ గుర్తింపు ఉన్న సభ్యులు క్రియాశీలంగా వ్యవహరిస్తున్నారని పోలీసులు గుర్తించారు. విచారణలో భాగంగా ఈ పథకంతో ముడిపడిఉన్న 11 బ్యాంకు ఖాతాలను స్తంభింపజేశారు. అనుమానం ఉన్న ఖాతాల్లో ఆర్థిక లావాదేవీలు పరిశీలిస్తూనే, ఆస్తుల గుర్తింపు ప్రక్రియ కొనసాగిస్తున్నారు. అయితే.. కేసు దర్యాప్తులో భాగంగా నిధుల దుర్వినియోగం నిరోధించేందుకు, బాధితుల సొమ్ముకు భద్రత కల్పించేందుకు ఈ దశ కీలకంగా మారుతుందని పోలీసులు పేర్కొంటున్నారు.

రహస్య సమావేశాలు..

ఈ వ్యవహారంలో భాగస్వాములుగా ఉన్న వారంతా సభ్యులను ఆకర్షించేందుకు రహస్య సమావేశాలు నిర్వహించడం పరిపాటిగా మారింది. ఇదివరకు అరెస్టయిన వ్యక్తులతో సహా పలువురు కుట్రదారులు గత 8 నెలలుగా పలు చోట్ల రహస్యంగా సమ్మేళనాలు నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. ఇందులో భాగంగా ఇప్పటికే నాలుగు వేర్వేరు దేశాలకు వెళ్లినట్లు విచారణలో వెల్లడైంది. విదేశీ ప్రయాణాలను సైతం తమ ప్రచారంలో ఓ ప్రధాన ఆకర్షణగా ఉపయోగిస్తున్నారు. దీనివల్ల చాలామంది సులభంగా వీరి మాటలు నమ్మి పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్నారు. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ ప్రయాణాలు ప్రస్తుతం పరిశీలనలో ఉన్నాయని, మరింత సమాచారం సేకరించేందుకు అధికారులు సంబంధిత ఏజెన్సీలతో కలిసి ప్రయత్నాలు ముమ్మరం చేశామని పోలీసువర్గాలు వెల్లడిస్తున్నాయి. కాగా.. మొత్తం వ్యవహారంలో ప్రధాన కుట్రదారు బ్రిజ్ మోహన్ సింగ్ అని గుర్తించారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఇతడిపై ఇప్పటికే పలు కేసులు నమోదైనట్లు చెప్తున్నారు.

బాధితులు ముందుకురావాలి:

జానకి షర్మిల, ఎస్పీ, నిర్మల్

విచారణ, దర్యాప్తు పూర్తి పారదర్శకంగా కొనసాగుతోంది. బాధితులు ముందుకొచ్చి వివరాలు అందజేస్తే రికవరీ ప్రక్రియ వేగవంతం చేసేందుకు అవకాశం ఏర్పడుతుంది. పోలీసులు సంప్రదించేవరకు చూడకుండా స్వచ్ఛందంగా ముందుకురావాలి. మోసపోయిన సొమ్మును రికవరీ చేసేందుకు, అసలైన యజమానులకు అప్పగించేందుకు చట్టపరమైన విధానాలు అవలంబిస్తున్నాం. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. యూబిట్‌కు సంబంధించి ఎలాంటి సమాచారం ఉన్నా నేరుగా తమను సంప్రదించాలి. దర్యాప్తు అధికారి అవినాశ్‌కుమార్ నేతృత్వంలో ప్రత్యేక బృందం విచారణ కొనసాగిస్తోంది.

సాధారణ వర్షపాతం.. సాగుకు ఊతం



నిండుకుండలా ఎల్లంపల్లి

నైరుతి రుతు పవనాలు రాష్ట్రం నుంచి నిష్క్రమించాయి. దీని ప్రభావంతో జూన్ రెండో వారం నుంచి ఇటీవలి వరకు వానలు కురిశాయి. సుమారు మూడున్నర నెలలపాటు కురిసిన వర్షం ఉమ్మడి జిల్లాలో సాధారణంగా ఉండగా నిర్మల్ జిల్లాలో మాత్రం సాధారణం కంటే ఒక శాతం ఎక్కువగా కురిసింది. ఆగస్టు రెండో వారం వరకు లోటు వర్షపాతం నెలకొన్నప్పటికీ ఆ తర్వాత తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలతో సగటున సాధారణ వర్షం నెలకొంది. జూన్ మొదటి వారంలో రాష్ట్రంలోకి నైరుతి ప్రవేశించగా జూన్ 15 నుంచి పూర్తి స్థాయిలో విస్తరించింది. సెప్టెంబరు 23 వరకు నిష్క్రమించాయి. ఈ సారి కురిసిన వానలతో జలాశయాలు, నీటి వనరుల్లోకి సమృద్ధిగా నీరు చేరడంతో సాగుకు ఊతమిచ్చింది.

-న్యూస్‌టుడే, మంచిర్యాల వ్యవసాయం



దండేపల్లి శివారులో సాగవుతున్న వరి


జలాశయాలకు జలకళ

నైరుతితో కురిసిన వానలకు ఉమ్మడి జిల్లాలోని పలు జలాశయాలు, చెరువులు, ఇతర నీటి వనరులు జలకళను సంతరించుకున్నాయి. ఆదిలాబాద్ జిల్లాలోని సాత్నాల, మత్తడి నిర్మల్ జిల్లాలోని కడెం, స్వర్ణ, శ్రీరాంసాగర్, సుద్దవాగు, మంచిర్యాల జిల్లాలోని ఎల్లంపల్లి, ర్యాలీ, గొల్లవాగు, నీల్వాయి, కుమురంభీం జిల్లాలోని పీపీ జలాశయం, అడ, వట్టివాగు తదితర జలాశయాల్లోకి భారీగా నీరు చేరడంతోపాటు చెరువులు, వాగులు, ఇతర నీటి వనరులన్నీ జలకళను సంతరించుకున్నాయి. ఇవి పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరుకున్నాయి.


పచ్చని పంటలతో కళకళ..

నీటి వనరుల్లోకి సమృద్ధిగా నీరు చేరడంతో సాగు ఇబ్బందులు తొలగాయి. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో పచ్చని పంటలతో కళకళలాడుతున్నాయి. ఆదిలాబాద్ జిల్లాలో పత్తి, సోయాబీన్, మిగతా మూడు జిల్లాల్లో పత్తి, వరి పంటలు ప్రధానంగా సాగవుతున్నాయి. పప్పుదినుసులు, మొక్కజొన్న కొంత మేర సాగు చేస్తున్నారు.

ఆదిలాబాద్ జిల్లాలో ఏడు శాతం అధికం



నైరుతి ప్రభావంతో ఆదిలాబాద్ జిల్లాలో వానాకాలం సీజన్‌లో సాధారణ వర్షపాతం 969.7 మిల్లీమీటర్లుకాగా 1041. మి.మీ నమోదైంది. ఇంద్రవెల్లి, గుడిహత్నూరు, ఆదిలాబాద్ గ్రామీణం, అర్బన్, తాంసి మండలాల్లో అధిక వర్షపాతం నమోదుకాగా మిగతా మండలాల్లో సాధారణం కంటే 20 శాతం తక్కువగా నమోదైంది.



మంచిర్యాల జిల్లాలోని మూడు మండలాల్లో ..



మంచిర్యాల జిల్లాలోని కాసిపేట, కన్నెపల్లి, కోటపల్లి మండలాల్లో 20 శాతానికి మించి మిగులు వర్షపాతం నమోదుకాగా మిగతా 15 మండలాల్లో సాధారణ వర్షపాతం నెలకొంది. సీజన్‌లో సాధారణ వర్షపాతం 913.0 మి.మీకాగా 967.3 మి.మీ నమోదైంది. ఆరు శాతం అధికంగా ఉంది.

కుమురంభీంలో 14 శాతం..



కుమురంభీం జిల్లాలో 14 శాతం అధికంగా నమోదైంది. జైనూర్, వాంకిడి, కౌటాల, చింతలమానెపల్లి, పెంచికల్‌పేటలో మిగులు వర్షపాతం నమోదుకాగా మిగతా మండలాల్లో సాధారణం నెలకొంది. సాధారణం 999.6 మి.మీకాగా 1144.4 మి.మీ అంటే 14 శాతం అధికంగా నమోదైంది..

నిర్మల్ జిల్లాలో ఇలా..



ఉమ్మడి జిల్లాలోని 19 మండలాలకు పది మండలాల్లో అధిక వర్షపాతం నమోదుకాగా కుభీరు, తానూరు, భైంసా, కుంటాల, నర్సాపూర్-జి, సారంగాపూర్, సోన్, ఖానాపూర్, దస్తురాబాద్ మండలాల్లో సాధారణం నెలకొంది. సాధారణం 881.8 మి.మీకాగా 1061.7 మి.మీ అంటే 20 శాతం అధికంగా నమోదైంది.

యజమాని లేకున్నా ఇంటికి చేరుకుంటాం



పంట సాగులో తోడుగా నిలిచే ఎడ్లు తమ యజమాని వెంట లేకపోయినా ఎడ్లబండిని ఇంటికి తీసుకెళ్లడం విశేషం. యజమాని ఇంటికి వెళ్లే దారి అలవాటు ఉండటంతో తోడుగా రైతు లేకుండానే నేరుగా ఇంటికి వెళ్తున్నాయి. ఇంద్రవెల్లి మండలం సమాక పంచాయతీ పరిధిలోని పాటగూడ గ్రామానికి చెందిన రైతు కుర్ర రాజేశ్వర్‌కు ఆదిలాబాద్ గ్రామీణ మండలంలోని పోతగూడ గ్రామ శివారులో సాగు భూమి ఉంది. సాయంకాలం సమయంలో రైతు ఎడ్లబండిపై పచ్చి గడ్డిని వేసి, బండి వెనకాల లేగదూడను కట్టి చేలో రోజంతా పని చేసిన ఎడ్లను ఇంటి దారి పట్టించారు. మూడు కి.మీ దూరంలోని యజమాని ఇంటికి వెళ్తూ.. అడ్డువచ్చిన వాహనాలను తప్పించుకుంటూ ఇలా వెళ్తున్న చిత్రాలను బుధవారం 'న్యూస్‌టుడే' క్లిక్‌మనిపించింది. - న్యూస్‌టుడే, ఇంద్రవెల్లి

అంతర్రాష్ట్ర గంజాయి ముఠా అరెస్టు

● పట్టుబడ్డ సరకు విలువ రూ.2.25 కోట్లు

తలమడుగు, న్యూస్‌టుడే : తలమడుగు మండలం లక్ష్మీపూర్ చెక్‌పోస్టు వద్ద బుధవారం 292 ప్యాకెట్లలోని 9 క్వింటాళ్ల గంజాయి, కంటైనర్‌ను పోలీసులు పట్టుకున్నట్లు ఎస్పీ గౌష్ ఆలం వెల్లడించారు. సరకు విలువ రూ.2.25 కోట్లు ఉంటుందన్నారు. ఆంధ్రా, ఒడిశా సరిహద్దు అటవీ ప్రాంతం నుంచి వరంగల్, కరీంనగర్ మీదుగా తెలంగాణ, మహారాష్ట్రలతో పాటు ఇతర రాష్ట్రాలకు సరఫరా చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠా సభ్యులను పట్టుకున్నట్లు వివరించారు. ఇద్దరిని అరెస్టు చేసి 8 మందిపై కేసు నమోదు చేశామన్నారు. తలమడుగు పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. ఆంధ్రా, ఒడిశా నుంచి పెద్ద ఎత్తున గంజాయి తరలుతోందని ముందస్తు సమాచారంతో ఉదయం అంతర్రాష్ట్ర రహదారి లక్ష్మీపూర్ చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేపట్టారు. ఉత్తరాఖండ్‌కు చెందిన ఐచర్ కంటైనర్ వాహనం ఆదిలాబాద్ పట్టణం వైపు నుంచి మహారాష్ట్ర వెళ్తోంది. ఈ క్రమంలో వాహనాన్ని చెక్‌పోస్టు సమీపంలో తనిఖీ చేయగా అందులో 9 క్వింటాళ్ల గంజాయిని, డ్రైవర్ వసీం, క్లీనర్ అర్మాన్‌ను అదుపులోకి తీసుకున్నారు. వీరితో పాటు ఉత్తరాఖండ్ హరిద్వార్‌కు చెందిన అన్నుజైన్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన పండిత్, సోను అన్సారి గంజాయి వ్యాపారం చేస్తున్నారని తెలిపారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం రాయ్‌పూర్, సుక్మా జగదల్‌పూర్ జిల్లాల అటవీ ప్రాంతం నుంచి గంజాయిని పైన పేర్కొన్న ముగ్గురికి డ్రైవర్, క్లీనర్లు సరఫరా చేస్తున్నారని వివరించారు. ఆంధ్రా - ఒడిశా అటవీ ప్రాంతంలో 900 కిలోల గంజాయి ఉందని దానిని మహారాష్ట్రలోని బుల్దానా, దూలే జిల్లాలకు తరలించేందుకు వారు రూ.1,50,000 ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆదిలాబాద్ నుంచి తలమడుగు మండలం మీదుగా మహారాష్ట్ర వెళ్తుండగా పక్కా ప్రణాళికతో పట్టుకున్నట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇంత పెద్ద మొత్తంలో గంజాయి పట్టుబడటం ఇదే మొదటిసారన్నారు. అంతర్రాష్ట్ర ముఠా సభ్యులను అరెస్టు చేయడంలో కీలక పాత్ర పోషించిన ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి, డీసీఆర్బీ డీఎస్పీ సురేందర్‌రెడ్డి, గ్రామీణ సీఐ ఫణిందర్‌ను ఎస్పీ అభినందించారు. వారితో పాటు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, జైనథ్ సీఐడి సాయినాథ్, ఎస్సైలు అంజమ్మ, ముజాహిద్, విష్ణువర్ధన్‌లను అభినందించి నగదు బహుమతి అందించారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ గౌష్ ఆలం

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిద్దాం

ఉట్నూరు, న్యూస్‌టుడే : తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వచ్చే ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిద్దామని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ వ్యవసాయ సహాయ సంచాలకురాలు సంధ్యారాణి అన్నారు. బుధవారం ఉట్నూరు ఐటీడీఏలోని ఉద్యాన నర్సరీని పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయ విధానం అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. గిరిజన రైతులు ప్రకృతి వ్యవసాయం చేసేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రకృతి సేద్య పద్ధతిలో పండించే పంటల దిగుబడి గురించి ఆరా తీశారు. పీహెచ్‌ఓ సందీప్ కుమార్, హెచ్‌ఓ సుధీర్ కుమార్, రైతులు పాల్గొన్నారు.



సేంద్రియ కషాయాన్ని పరిశీలిస్తున్న ఏడీఏ సంధ్యారాణి

పట్టు తప్పినా వదల్లేదు!



చేప దొరికిందోచ్..




నోటిలో నుంచి జారిపోతూ..



చివరకు గుటుక్కున మింగేసి..

ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలం మత్తడివాగు జలాశయంలో నీటి కొంగ ఓ చేపను పట్టుకుంది. ఆ చేప నోటిలోంచి జారిపోతున్నా.. ఒడుపుగా నోటితో కరిచి పట్టుకుంది. అయినా ఆ చేప పట్టు విడిపించుకునేందుకు తీవ్ర ప్రయత్నం చేసింది. ఇంతలో ఆ చేప ఎక్కడ జారిపోతుందో అని ఒక్కసారిగా గాల్లోకి ఎగిరేసి గుటుక్కున మింగేసింది. జలాశయాన్ని చూడటానికి వచ్చిన పర్యాటకులు ఈ దృశ్యం చూసి ఆశ్చర్యపోయారు. - ఈనాడు, ఆదిలాబాద్ - న్యూస్‌టుడే, తాంసి

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక



ఉమ్మడి జిల్లా మహిళల జట్టు

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రంలోని తెలంగాణ గిరిజన ఆదర్శ బాలికల క్రీడా పాఠశాల వద్ద బుధవారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు రసవత్తరంగా సాగాయి. ఉమ్మడి ఆదిలాబాద్ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్ మహిళలు, పురుషులకు నిర్వహించిన పోటీల్లో 250 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల, కళాశాల ప్రిన్సిపల్ అబ్దుల్ రహీం, అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కనపర్తి రమేశ్‌లు క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలు ప్రారంభించారు. పురుషులు, మహిళలు నాలుగేసి జట్లు చొప్పున ఆడించారు. మహిళలు, పురుషులు రెండు విభాగాల నుంచి 21 మంది క్రీడాకారుల చొప్పున ఎంపిక చేశారు. వీరికి ఏడు రోజుల పాటు ప్రత్యేక శిక్షణ శిబిరం నిర్వహించి టీంకు అవసరమయ్యే 16 మంది చొప్పున రెండు టీంలను ఎంపిక చేస్తారని చెప్పారు. ఆ రెండు జట్లు అక్టోబర్ 9-11 వరకు రంగారెడ్డి జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఆడుతారని వివరించారు. కార్యక్రమంలో క్రీడా పాఠశాల హెచ్‌ఎం జంగు, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సట్ల శంకర్, గిరిజన క్రీడల అధికారి మీనారెడ్డి, సాఫ్ట్‌బేస్ బాల్ కార్యదర్శి గురవేందర్, హ్యాండ్ బాల్ నేషనల్ రెఫరీ కళ్యాణ్, శిక్షకులు అరవింద్, రాకేష్, రవి, పీడీ, పీఈటీలు గౌరి, హారిక, చిన్నక్క, యాదగిరి, వెంకటేష్ పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)

ఆసిఫాబాద్ : 80085 73640
కాగజ్‌నగర్: 80085 73635
జైనూరు : 63045 83192
రెబ్బెన : 80085 73643

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే

మండలంలోని బట్టుపల్లి-అందవెల్లి రోడ్డు అధ్వానంగా మారింది. రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. - తిరుపతి, కాగజ్‌నగర్

✔ బట్టుపల్లి-అందవెల్లి ప్రధాన రోడ్డు మధ్య భాగంలో కొంతమేర గుంతలు పడ్డాయి. వాటికి త్వరలో మరమ్మతులు చేయిస్తాం. - రమేష్, ఎంపీడీఓ, కాగజ్‌నగర్

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి
★ మరొకరికి తీవ్ర గాయాలు

హాజీపూర్, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం కుమురంభీం జిల్లా వాంకిడి మండలం సోయం గూడ గ్రామానికి చెందిన ఆత్రం జ్యోతిరావు, బిలాల్‌గూడకు చెందిన కోవ శేఖర్ ద్విచక్రవాహనంపై మంచిర్యాల నుంచి లక్సెట్టిపేట వైపునకు ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. ఇదే క్రమంలో హాజీపూర్ మండల కేంద్రం లోని నర్సరీ సమీపంలో ఎదురుగా లక్సెట్టిపేట మంచిర్యాల వైపునకు వస్తున్న కంకర లారీ అతివేగంగా వచ్చి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న జ్యోతిరావు(41) అక్కడిక క్కడే మృతి చెందగా, కోవ శేఖర్ తీవ్ర గాయాలయ్యాయి. వీరిని మంచి ర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ఇంతవరకు పోలీ సులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని, ప్రమాదానికి కారణమైన లారీపై కేసు నమోదు చేసినట్లు సమాచారం.

కాలువలో పడి యువకుడు..

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : మండలంలోని ఈదులవాడకు చెందిన పురుషోత్తం(32) బుధవారం మధ్యాహ్నం వట్టివాగు కాలువలో పడి మృతి చెందాడు. గ్రామస్థుల కథనం ప్రకారం.. ఉదయం ఇంటి నుంచి తల్లి సూరక్క, కూలీలతో కలిసి చేనుకు వెళ్లాడు. పంటకు మందు పిచికారీ చేశారు. మధ్యాహ్నం కూలీలు భోజనం చేస్తున్న సమయంలో నీటి కోసం సమీపంలోని వట్టివాగు కాలువ వద్దకు వెళ్లాడు. ఎంతకీ రాలేదు. చేను నుంచి తల్లి ఇంటికి వస్తున్న సమయంలో కాలువలో పడి కనిపిం చాడు. గమనించిన సమీపంలోని వారు వెంటనే పోలీసులకు సమాచా రమిచ్చారు. మృతుడికి భార్య వాణి ఉన్నారు. అయితే కాలువలో నీరు మూడు ఫీట్ల వరకు మాత్రమే ఉన్నాయి. దీంతో అతని మృతిపై అనుమా నాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై పోలీసులను సంప్రదించగా.. ఫిర్యాదు అందలేదన్నారు.

వడ్ల లారీ పట్టివేత

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే : కాగజ్‌నగర్‌లోని లారీ అసోసియేషన్ సమీ పంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వినోద్‌కుమార్ బుధవారం వడ్ల లోడుతో ఉన్న లారీని పట్టుకున్నారు. ప్రభుత్వ ముద్రతో ఉన్న గోనె సంచుల్లో వడ్లను నింపి తరలిస్తుండటంతో.. పట్టుకుని కాగజ్‌నగర్ సివిల్ సప్లై గోదాంకు తరలించారు. వడ్ల శాంపిళ్లను సేకరించి అనంతరం పౌర సరఫరాల శాఖ అధికారులు విచారణ నిమిత్తం కౌటాలలోని ఓ రైస్‌మిల్లుకు వెళ్లినట్లు తెలిసింది. కాగా కౌటాల నుంచి మిర్యాలగూడకు రెండు లారీల్లో వడ్లను తరలిస్తుండగా ఒక లారీ పట్టుబడినట్లు సమాచారం. ఈ విషయమై జిల్లా పౌర సరఫరాల అధికారిని సంప్రదించగా.. ఆయన స్పందించలేదు.

ఇసుక ట్రాక్టర్లు..

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని పెద్దవాగు నుంచి ఎలాంటి అనుమతి లేకుండా తరలిస్తున్న 11 ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు సీఐ సతీష్ తెలి పారు. ముందస్తు సమాచారం మేరకు బుధవారం మధ్యాహ్నం ఆర్డీవో లోకే శ్వర్‌రావు, తహసీల్దార్ రోహిత్, భూగర్భ గనుల ఏడీ గంగాధర్‌లతో కలిసి సంయుక్త తనిఖీలు చేసినట్లు చెప్పారు. వాగు వద్ద ఉన్న 11 ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. తహసీల్దార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వాహ నాల యజమానులు, డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు.

గుడుంబా..

చింతలమానెపల్లి: మండల కేంద్రంలో 20 లీటర్ల గుడుంబాను పట్టుకు న్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు. బుధవారం వాహనాల తనిఖీ చేయగా.. మండల కేంద్రానికి చెందిన జాడి కుమార్ గూడెం గ్రామం నుంచి గుడుంబా తరలిస్తున్న క్రమంలో పట్టుకుని అతనిపై కేసు నమోదు చేశామన్నారు. గుడుంబాతో పాటు, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకు న్నట్లు ఎస్సై తెలిపారు.

ఎద్దును ఢీకొట్టిన ద్విచక్ర వాహనదారుడు

వాంకిడి, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని జ్యోతిబాపూలే ఎక్స్‌రోడ్డు వద్ద జాతీయ రహదారిపై బుధవారం సాయంత్రం ఓ ద్విచక్రవాహనదారుడు ఎద్దును ఢీకొట్టాడు. దీంతో ఆసిఫాబాద్ మండలం సాలెగూడకు చెందిన నగోసే మధుకర్ ద్విచక్రవాహనంపై ఆసిఫాబాద్ వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ఎద్దును ఢీకొట్టడంతో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న ఎస్సై ప్రశాంత్ చేరుకుని క్షతగాత్రుడిని వాంకిడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం ఆసిఫాబాద్ జిల్లా ఆసుపత్రికి తీసుకెళ్లారు. బాధి తుల నుంచి ఫిర్యాదు అందలేదని ఎస్సై తెలిపారు.

జీవాలపై అడవి కుక్కల దాడి

తిర్యాణి, న్యూస్‌టుడే: మండలంలోని సాలెగూడ గ్రామానికి చెందిన సోయం మాన్కు, ఆత్రం బాపురావు, ఆత్రం జగ్గారావులకు చెందిన ఐదు మేకలపై అడవి కుక్కలు దాడి చేసి చంపేశాయి. మరో ఇరవై మేకలు గాయపడ్డట్లు బాధిత రైతులు తెలిపారు. మంగళవారం జోరం వాగు అటవీ ప్రాంతంలో మేకలను మేపేందుకు అటవీ ప్రాంతానికి వెళ్లగా సాయంత్రం దాదాపు 20 అడవి కుక్కలు మందపై దాడిచేశాయి. అయిదు మేకలు అక్క డికక్కడే మృతిచెందాయి. అటవీ అధికారులు నష్ట పరిహారం అందించాలని అడవి కుక్కల నివారణ చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

గిరి గ్రామాలు సందర్శిస్తూ.. సమస్యలు తెలుసుకుంటూ

పెంచికల్‌పేట, న్యూస్‌టుడే: మండలంలోని అతి మారుమూల గ్రామాలైన కమ్మర్గాం, జిల్లెడ, మొర్లిగూడ గ్రామాలను అదనపు కలె క్టర్ దీపక్ తివారీ, కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్ శ్రద్ధ శుక్లా బుధవారం పర్యటించారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో మందుల నిలువ, ప్రసూతి గది, సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. ఇక్కడ రెగ్యులర్ వైద్యాధికారి లేకపోవడంతో మెరుగైన వైద్యం కోసం 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న కాగజ్‌నగర్‌కు వెళ్లాల్సి వస్తుందని.. పోతెపల్లి గ్రామ మాజీ సర్పంచి దాసరి చంద్రమౌళి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. బెజ్జూర్ నుంచి కమ్మర్గాం, కమ్మర్గాం నుంచి మొర్లిగూడ, గుండెపల్లి నుంచి ఆగర్‌గూడ వరకు రోడ్డు లేకపోవ డంతో అత్యవసర పరిస్థితుల్లో ఇబ్బందులు గురవుతున్నామని, రోడ్డు మంజూరు చేయా లని గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు. పెద్దవాగు, ప్రాణహిత పరీవాహక ప్రాంతాల్లో సాగు చేసిన పంటలు ఏటా వరద పాలై నష్టపోతు న్నామని తమకు నష్టపరిహారం ఇప్పించాలని రైతులు కోరారు. రెవెన్యూ పరిధిలోని రోడ్లను గుర్తించాలని తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావును వారు ఆదేశిం చారు. గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణా లకు ప్రతిపాదనలు పంపించాలని ఏపీవో సతీష్‌ను ఆదేశించారు. అనం తరం కమ్మర్గాం ఆశ్రమ పాఠశాలను సందర్శించి విద్యార్థులను ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు.



విద్యార్థుల ప్రతిభ పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్

రేపు ఉమ్మడి జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు

గోలేటి టౌన్‌షిప్, న్యూస్‌టుడే: గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి పాఠశాల మైదానంలో ఈ నెల 27న అండర్-19 బాల్‌బ్యాడ్మింటన్ జిల్లా బాలబాలికల జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఉమ్మడి ఆదిలా బాద్ జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అసో సియేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్. నారాయణరెడ్డి తెలిపారు. జిల్లా స్థాయికి ఎంపికైన జట్ల క్రీడాకారులు వచ్చే నెల 4-6 తేదీ వరకు కామా రెడ్డిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. 2005 జనవరి 2వ తేదీ నుంచి జన్మించిన క్రీడాకారులు పోటీలకు అర్హులని, సంబంధిత ఆధార్‌కార్డు తీసుకొని రావాలన్నారు. వివరాలకు చరవాణి నం. 93816 62413 ద్వారా పీఈటీ భాస్కర్‌ను సంప్రదించాలన్నారు.

పోలీసులకు జిల్లాస్థాయి ప్రతిభా పోటీలు

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : పోలీసు అధికారులు, సిబ్బంది ప్రతిభను వెలికి తీసేందుకు పోలీసు డ్యూటీ మీట్-2024 నిర్వ హిస్తున్నట్లు ఎస్పీ డి.వి. శ్రీనివాస్ రావు తెలిపారు. రాష్ట్ర ఆవిర్భావం తరువాత మొదటిసారి నిర్వహి స్తున్నట్లు చెప్పారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా స్థాయి పోటీలను ప్రారంభిం చారు. కంప్యూటర్, ఫోరెన్సిక్ సైన్స్, ఫింగర్ ప్రింట్, హ్యాండ్లింగ్ లిఫ్టింగ్ ప్యాకింగ్, బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్, పోలీసు జాగిలాలు.. ఇలా వివిధ విభాగాల్లో, ట్రాకింగ్ ఎక్స్‌క్లూజివ్ విభాగాల్లో పోటీలు నిర్వ హించినట్లు చెప్పారు. మొత్తం 30 మంది పాల్గొన్నారన్నారు. విధుల్లో మరింత నైపు ణ్యాలు పెంచుకోవడం, కేసుల పరిశోధన, నేర నివృత్తి చేసేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎలాంటి ఆధారాలు తీసుకోవాలి, తదితర అంశాలపై పరీక్షలు నిర్వహిం చారు. బాంబ్‌స్క్వాడ్, నార్కోటిక్, ట్రాకర్ జాగి లాల ద్వారా నేర నిరూపణ ఎలా చేయాలన్న అంశాలపై భౌతిక ప్రదర్శన చేశారు. ప్రతిభ చాటిన వారిని జోనల్‌స్థాయి పోటీలకు పంపి స్తామన్నారు. అక్కడ ప్రతిభ చాటితే అక్టోబర్ 14-18 వరకు మొదటి తెలంగాణ రాష్ట్ర పోలీస్ డ్యూటీ మీట్‌లో ఆడుతారని వివరించారు.



డాగ్ స్క్వాడ్‌తో బాంబు గుర్తించే పరీక్ష



ప్రమాద స్థలం వద్ద ఆధారాల సేకరణ తీరు

కౌటాల మండల విద్యాధికారిగా హన్మంతు

కౌటాల, న్యూస్‌టుడే : కౌటాల మండల విద్యాధికారిగా గావుడె హన్మంతు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఎంఈఓ సోమయ్య బదిలీపై ఆదిలాబాద్‌కు వెళ్లడంతో ముత్యంపేట జడ్పీఎస్ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న హన్మంతుకు ఇన్‌ఛార్జి ఎంఈఓ బాధ్యతలను అప్పగించారు. ఆయనను ఎమ్మార్సీ కార్యాలయంలో ఉపాధ్యాయులు సన్మానించారు.

మురుగు శుద్ధిపై విద్యార్థులకు అవగాహన

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే : స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా.. బుధవారం పట్టణంలోని విద్యార్థులకు పురపాలిక ఆధ్వర్యంలో మురుగు నీటి శుద్ధిపై అవగాహన కల్పించారు. ఎస్పీఎంలోని శుద్ధి కేంద్రం పనితీరుపై సీఎస్ఆర్ మేనేజర్ రీనా బిల్వాల్, ప్రాజెక్టు అధికారి సుందరం వివరించారు. మురుగు నీటిని పర్యావరణంలోకి విడుదల చేసే ముందు శుద్ధి చేస్తాయని, హానికరమైన కలుషితాలను తొలగిస్తాయని చెప్పారు. అనంతరం పట్ట ణంలో విద్యార్థులతో స్వచ్ఛతపై ర్యాలీ నిర్వహించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్, పర్యావరణ ఇంజినీర్ ప్రణీల్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



శుద్ధి కేంద్రం వద్ద విద్యార్థులతో మాట్లాడుతున్న అధికారులు

రహదారి ఇలా.. నడిచేదెలా.?



మండలంలోని గుండాయిపేట గ్రామంలో అంతర్గత రహదారుల పరిస్థితి అధ్వానంగా మారింది. చినుకు పడితే చిత్తడిగా మారుతు న్నాయి. ఇటీవల కురిసిన వర్షా లకు రహదారులపై మురుగునీటి గుంతలు ఏర్పడ్డాయి. విద్యార్థులు ఉదయం పాఠశాలకు వెళ్లాలంటే ఒకచేతిలో పాఠ్యపుస్తకాలు, ఇంకో చేతిలో తమ దుస్తులను ఎత్తిపట్టు కొని నడవాల్సిన పరిస్థితి నెల కొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. **- న్యూస్‌టుడే, కౌటాల**

జూద స్థావరాలపై టాస్క్‌ఫోర్స్ అధికారుల దాడి

సిర్పూర్(టి), న్యూస్‌టుడే: మండలంలోని చీలపెల్లి గ్రామంలో బుధ వారం రాత్రి జూద స్థావరంపై టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు నిర్వ హించారు. 15 మంది పరారు కాగా అయిదుగురిని పట్టుకుని స్థానిక పోలీ స్‌స్టేషన్‌కు తరలించారు. వీరిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై కమలా కర్ తెలిపారు. ఎల్ముల కమలాకర్, నల్లబోయిన బానేష్, లింగడి నెహ్రూ, దుర్గం శ్రీకాంత్, దుర్గం పితాంబర్ ఉన్నారు. పరారైన వారిలో కలీం, వెంకటి, బండ్రు మధుకర్, అజ్మీర మహేష్, బొమ్మెన శ్రీనివాస్, బండు, రాందాస్, ఎమ్మిలే రాజు, హీరాజీ, సంతోష్, గుర్నాజీ, అశోక్, బోనగిరి నవీన్, ఎల్మిలే దశరథ్, దండ్రే దశరథ్ ఉన్నారు. వారి నుంచి రూ. 46,600 నగదు, 5 చరవాణులు, 8 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసు కున్నట్టు చెప్పారు. కాగా ఓ పోలీస్ అధికారే దాడికి ముందు చరవాణి ద్వారా సమాచారం అందించినట్లు ఆరోపణలు వ్యక్తమయ్యాయి.

పరామర్శించి.. ఆర్థికసాయం అందజేసి

బెజ్జూరు, న్యూస్‌టుడే : మండల కేంద్రంలోని గుమ్మల శ్రీనివాస్‌కు చెందిన ఇంట్లో ఇటీవల విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ అయి సామగ్రితోపాటు ఇల్లు కాలి పోయిన విషయం తెలిసిందే. బాధిత కుటుంబాన్ని బుధవారం మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పరామర్శించి రూ. 10 వేలు అందజేశారు. అనంతరం తంగడిపల్లి మహేష్ తండ్రి మొండయ్య సంవత్సరిక కార్యక్రమంలో పాల్గొ న్నారు. పలు గ్రామాల్లో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

పండిత్ దీన్‌దయాళ్ జయంతి

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే: పట్టణంలోని భాజపా కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు డా. కొత్తపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పండిత్ దీన్‌దయాళ్ ఉపా ధ్యాయ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. చేసుకున్న వారికి గుర్తింపు కార్డులను అందజేశారు.

తనిఖీ చేసి.. ఆరా తీసి

కెరమెరి, న్యూస్‌టుడే : గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించా లని జడ్పీ సీఈవో లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం హట్టి ఆశ్రమ పాఠ శాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు కనీస సామర్థ్యాలు పెంపొందించేలా కృషి చేయాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం వంటగది, మధ్యాహ్న భోజనం, పరిసరాలను పరిశీలించి సూచనలు చేశారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ఆయా శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు.

విద్యార్థికి చేయూత

చింతలమానెపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని డబ్బా గ్రామ ధరంపెల్లి చెందిన విద్యార్థి లొంబడి అరుణ్ తండ్రి 8 ఏళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. ఇద్దరు కుమారులను చదివించేందుకు అతని తల్లి ఇబ్బందులు పడుతోంది. అదే గ్రామానికి చెందిన శ్రీశివరామ సాయి యూత్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు ముందుకొచ్చారు. బుధవారం అరుణ్‌ను కౌటాల మండ లంలోని ప్రభుత్వ ఆశ్రమోన్నత పాఠశాల చేర్పించారు. పుస్తకాల సంచితో పాటు నోటు పుస్తకాలు, విద్యాసామగ్రి అందించారు.

వన్యప్రాణులు ప్రజాక్షేత్రాల్లోకి రాకుండా చర్యలు

బల్లార్ష: చంద్రపూర్ జిల్లాలో వన్యప్రాణులు ప్రజల ప్రాణాలను బలితీ సుకుంటున్నాయని, నివారణ చర్యలు చేపట్టాలని అటవీ శాఖ మంత్రి సుధీర్ మునగంటివార్ అధికారులకు సూచించారు. బుధవారం చంద్ర పూర్ జిల్లాధికారి కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల సినాడా గ్రామంలో బహిర్భూమికి వెళ్లిన ఏడేళ్ల వయస్సున్న బాలుడిని చిరుతపులి ఎత్తుకెళ్లిన ఘటన కలచివేసిందన్నారు.

మట్కా ఆడుతున్న ఒకరిపై కేసు

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే : పట్టణంలోని గాంధీచౌక్‌లో అంతర్జాలంలో మట్కా ఆడుతున్న అతిక్‌షేక్‌పై కేసు నమోదు చేసినట్టు టౌన్ సీఐ శంక రయ్య తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు టౌన్ ఎస్సై సుధాకర్ సాయంత్రం గాంధీ చౌక్‌లో తనిఖీలు చేపట్టారు. నిందితుడు అంతర్జాలంలో మట్కా ఆడుతుండగా పట్టుకుని అయిదు చిటీలు, రూ. 1500 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

భీం ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా పెందుర్ రాజేశ్వర్

కెరమెరి: జోడేఘాట్‌లో నిర్వహించే కుమురం భీం వర్ధంతి ఏర్పాట్లలో భాగంగా.. బుధవారం జోడేఘాట్‌లో భీం ఉత్సవ కమిటీ ఎన్నిక సమావేశం నిర్వహించారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా పెందుర్ రాజేశ్వర్, గౌరవ అధ్య క్షుడు భీం మనవడు సోనేరావు, తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

★ ఏటా జోడేఘాట్‌లో భీం వర్ధంతితోపాటు కుమురం సూరు వర్ధం తిని కూడా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా కుమురం భీం కమిటీతోపాటు కుమురం సూరు ఉత్సవ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

లోన్ కోసం క్లిక్ చేసి.. మోసపోయి



దహెగాం, న్యూస్‌టుడే : లోన్ వస్తుందని ఆశతో ఓ వ్యక్తి లింక్‌పై క్లిక్‌చేసి దాదాపు రూ. 31 వేలు మోసపోయిన ఘటన ఇది. ఎస్సై కందూరి రాజు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బ్రహ్మన్‌చిచ్చాల గ్రామానికి చెందిన దేశ్‌ము క్కుల సంజీవ్ బుధవారం యూట్యూబ్‌లో వీడియోలు చూస్తున్న క్రమంలో ధని ఫైనాన్స్ అనే యాడ్ వచ్చింది. దాని లింక్‌పై క్లిక్ చేసి లోన్ కోసం అప్లై చేశాడు. వెంటనే అతనికి ఫోన్ రావడంతో మాట్లాడాడు. అవతలి నుంచి ఓ వ్యక్తి మాట్లా డుతూ.. రెండు రోజుల తరువాత లోన్ డబ్బులు వస్తాయని డాక్యు మెంట్ ఛార్జీల కింద రూ. 6,550 ఫోన్‌పే చేయాలని చెప్పాడు. దీంతో అతను పంపిం చాడు. కొద్దిసేపటి తర్వాత సదరు వ్యక్తి మళ్లీ ఫోన్ చేసి ఖాతాలో డబ్బులు జమయ్యాయని చెప్పాడు. డబ్బులు జమకాకపోవడంతో సదరు వ్యక్తికి ఫోన్‌చేశాడు. జమ కావాలంటే ఫస్ట్ ఇన్‌స్టాల్‌మెంట్ కింద రూ. 24,698 చెల్లిం చాలని అవతలి నుంచి పేర్కొనడంతో.. ఫోన్‌పే ద్వారా ఆ మొత్తం చెల్లించాడు. అయినా డబ్బులు జమ కాకపోవడంతో.. మళ్లీ ఫోన్ చేయగా రెండో ఇన్‌స్టాల్‌మెంట్ కూడా కట్టాలని అటునుంచి చెప్పడంతో.. అనుమానం వచ్చిన సంజీవ్ మోసపోయానని గుర్తించాడు. మిత్రుడి సహాయంతో సైబ ర్‌క్రైమ్ హెల్ప్‌లైన్ నం. 1930కు ఫోన్‌చేసి ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చాలి

వాంకిడి, న్యూస్‌టుడే: విద్యార్థినులు చక్కగా చదువుకుని తల్లిదండ్రుల ఆశయా లను నెరవేర్చాలని జిల్లా ఇన్‌ఛార్జి డీఈఓ ఉదయ్‌బాబు సూచించారు. బుధవారం వాంకిడి కస్తూర్బాలో 'ప్రాజెక్టు డిగ్నిటీ' ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. జిల్లాలోని ఎనిమిది కస్తూర్బా విద్యాలయాలకు శానిటరీ నాప్కిన్స్‌తో పాటు తయారు చేసే యంత్రాలను పంపిణీ చేసేందుకు బీపీసీఎల్ (భారత్ పెట్రోలియం కంపెనీ లిమిటెడ్) సంస్థ ముందుకు రావడం హర్షనీయమన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం నాప్కిన్స్, యంత్రాన్ని పాఠశాల సిబ్బందికి అందజే శారు. కార్యక్రమంలో మండల నోడల్ అధి కారి శివచరణ్, బీపీసీఎల్ టెరిటరీ మేనే జర్ శ్రావణ్‌కుమార్, కాంప్లెక్స్ ప్రధానోపా ధ్యాయుడు నటరాజ్, డీటీ శ్రావణ్, ఎమ్మార్సై మాజిద్, ఏఎస్సై శ్యాంరావు, తది తరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు ప్రత్యేక వైద్యశిబిరం

తిర్యాణి, న్యూస్‌టుడే: పారిశు ద్ధ్య కార్మికులు తమ ఆరో గ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిం చాలని తిర్యాణి వైద్యాధికారి కౌరిల్య సూచించారు. ఎంపీ డీవో కార్యాలయంలో స్వచ్ఛ తాహీ సేవా కార్యక్రమంలో భాగంగా బుధవారం వైద్యశి బిరం నిర్వహించారు. 29 గ్రామ పంచాయతీల పారిశు ద్ధ్య కార్మికులు హాజర య్యారు. వైద్యాధికారి మాట్లా డుతూ.. కార్మికులు విధులు నిర్వహించిన అనంతరం చేతులు, కాళ్లు శుభ్రంగా కడు క్కోవాలని, పొగాకు, మద్యానికి దూరంగా ఉండాలని హితవుప లికారు. 52 మంది కార్మికులకు రక్తపోటు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. పలు వురు కార్మికులు జ్వరాలు, కాళ్లు, కీళ్లనొప్పులతో బాధపడుతు న్నట్లు గుర్తించామన్నారు. ఎంపీడీవో మల్లేష్, ఎంపీవో సుధాకర్, సూపర్‌వైజర్ శ్రీని వాస్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

★ స్వచ్ఛతాహీ సేవా కార్యక్ర మంలో భాగంగా.. ఎంపీడీవో, ఎంపీవో సుధాకర్ మండలంలోని అయిదుగురి పారిశుద్ధ్య కార్మి కులు ఉత్తమంగా సేవలు అందిం చినందుకు గాను శాలువాలతో సన్మానించి, జ్ఞాపికలు అందజే శారు. తిర్యాణి కారోబారి సుద్దాల తిరుపతి, ఖైరిగూడ, తిర్యాణి, దేవాయిగూడ, గుండాల కార్మి కులు నైతం భూమ్‌రావు, గద్దెల నరేష్, టేకం కన్నయ్య, కుమురం భీం ఉన్నారు.



కార్మికులకు పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి కౌరిల్య, చిత్రంలో ఎంపీడీవో మల్లేష్



గోలేటిలోని జీఎం కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న తెబొగకాసం నాయకులు

మొత్తం లాభాల నుంచి వాటా ఇవ్వాలని ధర్నా

గోలేటి టౌన్‌షిప్, న్యూస్‌టుడే: సింగరేణి ఆర్జించిన మొత్తం లాభాల నుంచి కార్మికులకు 33 శాతం లాభాల వాటా ఇవ్వాలని తెబొగ కాసం బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు డిమాండ్ చేశారు. బుధవారం సంఘం నాయకుల ఆధ్వర్యంలో గోలేటిలోని జీఎం కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం డిమాండ్‌తో కూడిన వినతిపత్రాన్ని జీఎం ఎం. శ్రీనివాస్‌కు అందజేసి మాట్లాడారు. సంస్థకు 2023-24 ఆర్థిక సంవత్స రంలో వచ్చిన రూ. 4,701 కోట్ల లాభాల నుంచి 33 శాతం వాటా చెల్లించాలన్నారు. కంపెనీ అభివృద్ధి పేరిట సుమారు రూ. 2,313 కోట్లను పక్కకు పెట్టడం సరికాదన్నారు. కంపెనీకి వచ్చిన మొత్తం లాభాల నుంచి 33 శాతం కార్మికులకు చెల్లించగా, మిగిలిన 67 శాతాన్ని కంపెనీ ప్రయోజనాలకు వాడుకోవాలని పేర్కొ న్నారు. సంఘం కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు మంగీలాల్, ఏరియా కార్యదర్శి మారిన వెంక టేశ్వర్లు, అలవేణి సంపత్, సెంట్రల్ కమిటీ నాయకులు ఓరం కిరణ్, మంత్ సమ్మయ్య, అనుముల సత్యనారాయణ, బాబురావు, వెంక టేష్, రమేష్ పాల్గొన్నారు.

వేతనాల కోసం ఆందోళన

గోలేటి టౌన్‌షిప్, న్యూస్‌టుడే: సింగరే ణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు వేత నాలు పెంచాలని డిమాండ్ చేస్తూ సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూని యన్ (ఇఫ్టూ) ఆధ్వర్యంలో బుధవారం గోలేటిలోని జీఎం కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం జీఎం ఎం. శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మానందం మాట్లాడుతూ.. కాంట్రాక్టు కార్మికులకు భారాస ప్రభుత్వం రూపాయి వేతనం కూడా పెంచలేదన్నారు. రాష్ట్రంలోని ఇతర విభాగా లలో విధులు నిర్వహిస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికులకు 11వ పీఆర్సీలో 30 శాతం వేతనాలు పెంచారన్నారు. సింగరే ణిలో 11వ వేజ్ బోర్డులో జాతీయ కార్మిక సంఘాలు కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు పెంచలేదని ఆరోపించారు. కోలిండియాలో చెల్లిస్తున్న వేతనాలను సింగరేణిలో చెల్లిం చాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు గడుస్తున్నా వేతనాలు పెంచే ప్రయత్నం చేయడంలేదని దుయ్యబట్టారు. బండారి తిరుపతి, నాయకులు శ్రీను, పోశం, తిరుపతి, కుమార్, సోమయ్య, పద్మ, లక్ష్మి, ఇంద్ర, రాణి, పోసుబాయి పాల్గొన్నారు.



వాయుకాలుష్య నియంత్రణ యంత్రం ప్రారంభం

గోలేటి టౌన్‌షిప్, న్యూస్‌టుడే: బెల్లంపల్లి ఏరియా సింగరేణి ఆధ్వర్యంలో బుధవారం ఖైరి గూర ఓపెన్‌కాస్టులో వాయుకాలుష్య నియం త్రణ యంత్రం ప్రారంభమైంది. ఈ యంత్రాన్ని (కదిలే ఫాగ్ కెనాన్) ఖైరిగూర ఓసీపీ ప్రాజెక్టు అధికారి మచ్చ గిరి నరేందర్ ప్రారం భించారు. కాలుష్య నివారణ, సింగరేణి ప్రభావిత ప్రాంత అభివృ ద్ధికి, సంక్షేమానికి యాజమాన్యం అధిక ప్రాధా న్యమిస్తుందన్నారు. దీని ద్వారా బొగ్గు రవాణా మార్గాలు, సమీప గ్రామాలకు సేవలు అందుతా యని చెప్పారు. ఖైరిగూర ప్రాజెక్టు ఇంజినీర్ వీరన్న, మేనేజర్ శంకర్, ఎన్విరాన్‌మెంట్ అధి కారి సూర్యనారాయణ, సీనియర్ పీవో నాగుల వేణు, ఏఐటీయూసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి మీస చంద్రశేఖర్, కాంట్రాక్టర్ అల్లాడి రాజు పాల్గొ న్నారు.

నర్సరీ కార్మికులందరికీ లాభాల వాటా చెల్లించాల్సిందే

గోలేటి టౌన్‌షిప్, న్యూస్‌టుడే: సింగరేణిలోని అన్ని విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మి కులకు లాభాల వాటా చెల్లించాలని తెబొగ కాసం బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు డిమాండ్ చేశారు. బుధవారం గోలేటిలోని సింగరేణి నర్సరీని సందర్శించారు. యూనిట్ రేట్ కింద పనిచే స్తున్న నర్సరీ కార్మికులు, వాహన డ్రైవర్లకు, ఓబీ కాంట్రాక్టు కార్మికులకు సింగరేణికి వచ్చిన లాభాల్లో నుంచి వాటా ఇవ్వాలన్నారు. సంఘం కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు మంగీలాల్, ఏరియా కార్యదర్శి మారిన వెంకటేశ్వర్లు, అల వేణి సంపత్, సెంట్రల్ కమిటీ నాయకులు ఓరం కిరణ్, మంత్ సమ్మయ్య, అనుముల సత్యనారాయణ, బాబురావు, బొంగు వెంకటేష్, రమేష్ పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న కార్మికులు

పుర కార్మికులను తొలగించొద్దు

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రంలోని పురపాలికలో కార్మికుల తొల గింపు నిర్ణయాన్ని మార్చుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ డిమాండ్ చేశారు. బుధవారం పుర కార్మికులతో కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వ హించారు. కలెక్టరేట్ వద్ద ధర్నా చేసి కలెక్టర్ వెంకటేష్ దోత్రేకు వినతి పత్రం అందించారు. బల్దియాలో 144 మంది కార్మికులు విధులు నిర్వహిస్తున్నారని, వారిలో కొందరిని తొలగిస్తామని కమిషనర్ చెబుతున్నారని ఆరోపించారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని, జీవో 60 ప్రకారం కేటగిరీ వారీగా వేతనాలు చెల్లించాలని కోరారు. సంఘం అధ్యక్షుడు రాజు, కార్యదర్శి సమ్మయ్య, గౌరవ అధ్యక్షుడు శ్రీకాంత్, సభ్యులు తదితరులున్నారు.

కలెక్టర్‌ను కలిసి.. గోడు వెల్లబోసుకుని

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : తమకు ఇంకా పంట రుణమాఫీ కాలేదని కాగ జ్‌నగర్ మండలం అంకుసాపూర్‌కు చెందిన రైతులు వాపోతున్నారు. బుధ వారం కలెక్టర్‌కు తమ గోడు వెల్లబోసుకున్నారు. గ్రామంలో సుమారు 150 మంది రైతులు రూ. 2 లక్షలకు మించి రుణం పొందిన వారున్నట్లు చెప్పారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని పోచయ్య, సాంబయ్య, భీంరావు తదితరులు కోరారు.

అక్రమంగా ఇసుక డంప్‌లు ఏర్పాటు చేస్తే చర్యలు

రెబ్బెన, న్యూస్‌టుడే: ఎవరైనా అక్రమంగా ఇసుక నిల్వలు చేస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేష్ హెచ్చరించారు. బుధవారం మండ లంలోని పలు వాగులను భూగర్భ శాఖ ఏడీ గంగాధర్, తహసీల్దార్ పి. రామ్మో హన్‌రావు, సీఐ సతీష్‌తో కలిసి పరిశీలించారు. ముందుగా గంగాపూర్ వాగును, అక్కడి నుంచి ఇటీవల దేవులగూడ, గోలేటి క్రాస్‌రోడ్డులో సీజ్ చేసిన ఇసుక నిల్వలను పరిశీలించారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలించినా, నిలువ చేసినట్లు తెలిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.